తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి

ఆదివారం
08 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

పి.ఏ.పల్లి మండల సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి

○ సూపర్ ఎల్‌నినోతో కరువు పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి : దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

○32 మంది లబ్ధిదారులకు రూ.32.03 లక్షల కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పి.ఏ.పల్లి, నవంబర్ 07(జనంసాక్షి) :
పి.ఏ.పల్లి మండల సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ,ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచించారు.శనివారం పి.ఏ.పల్లి మండలానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ.32,03,712 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అనంతరం పి.ఏ.పల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల ప్రజాపరిషత్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల పనితీరు,గ్రామ పంచాయతీల అభివృద్ధి,ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ,తాగునీటి సరఫరా,వీధి దీపాలు, పారిశుద్ధ్యం,ప్రభుత్వ భవనాల నిర్వహణతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామ పంచాయతీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానిక సంస్థల ఆదాయ వనరులను పెంపొందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, విద్యుత్, వైద్యారోగ్య, విద్య,రెవెన్యూ, ఇరిగేషన్,మహిళా శిశు సంక్షేమ తదితర శాఖల పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు



.-కరువు పరిస్థితులపై ముందస్తు ప్రణాళికలు అవసరం
రానున్న రోజుల్లో సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బాలు నాయక్ సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నీటి వనరులు, చెరువులు,బోర్లు,తాగునీటి పథకాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరాకు ముందస్తు కార్యాచరణ రూపొందించాలన్నారు. అదేవిధంగా రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.ప్రజా సమస్యలను సమావేశాలకే పరిమితం చేయకుండా అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేస్తూ పి.ఏ.పల్లి మండలాన్ని **వార్తా లోపలి పేజీలో**

ఓటరు జాబితాలో పేరు లేని
అర్హులకు మరో అవకాశం

నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు గడువు

ఏఎస్డీ జాబితాలో అర్హులున్నా మళ్లీ దరఖాస్తుకు అవకాశం

అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలి

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 07 (జనంసాక్షి):
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. గతంలో ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులు నవంబర్ 21వ తేదీ వరకు తమ ఫారాలను సమర్పించవచ్చని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఓటు హక్కుకు అర్హత ఉన్న ఏ ఒక్కరూ జాబితాలో పేరు లేకుండా ఉండకూడదని స్పష్టం చేశారు.జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు 12,43,781 మంది ఓటర్లు ఉండగా, గైర్హాజరు, చిరునామా మార్పు, మరణాలు, నకిలీ ఓటర్లకు సంబంధించి 1,57,854 మందితో కూడిన ఏఎస్డీ జాబితాను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో 10,85,927 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు.ఎన్నికల సంఘం తాజా సూచనల మేరకు ఏఎస్డీ జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ అర్హులైన వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.
ఏఎస్డీ జాబితాలో పేరు ఉండి, అదే నివాసంలో కొనసాగుతున్న వారు ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అనుబంధ పత్రం–బి సమర్పించాలని సూచించారు. ఈ ఫారాన్ని సంబంధిత ఓటరు లేదా వారి కుటుంబ సభ్యులు సమర్పించవచ్చని పేర్కొన్నారు.రాష్ట్ర పరిధిలోనే మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్న వారు ప్రత్యేకంగా ఎనిమిదో దరఖాస్తు పత్రం సమర్పించాల్సిన అవసరం లేదని, ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అనుబంధ పత్రం–సి, కొత్త నివాసానికి సంబంధించిన చిరునామా ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా ఎన్నికల నమోదు అధికారికి అందించాలని తెలిపారు. ఇప్పటికే ఆరవ దరఖాస్తు పత్రం ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ఈ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నవంబర్ 21లోగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు.

దేవరకొండ ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలి

ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్

రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్

దేవరకొండ, నవంబర్ 07 (జనంసాక్షి):
దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరికీ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ హృదయ పూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపావళి అంటే దీపాల పండుగ మాత్రమే కాకుండా చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో దీపావళికి విశిష్టమైన స్థానం ఉందని, ప్రతి ఇంటా దీపాలు వెలిగించడం ద్వారా ఆనందం, ఆశ, సానుకూలత వెల్లివిరుస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో, సుఖసంతోషాల మధ్య పండుగను ఆనందోత్సాహాలతో జరుపు కోవాలని ఆకాంక్షించారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలను ధైర్యంగా అధిగమిస్తూ మంచితనం, మానవతా విలువలు, సత్ప్రవర్తనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.చిన్న దీపం సైతం చిమ్మచీకటిని తొలగించినట్లే.. ప్రతి ఒక్కరిలోని ఆశావహ దృక్పథం జీవితాల్లో కొత్త వెలుగులు నింపు తుందని అన్నారు. ఈ దీపావళి పండుగ దేవర కొండ నియోజకవర్గ ప్రజల జీవితాల్లో నూతన ఆశలు, సంతోషాలు తీసుకురావాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలందరి ఇళ్లలో ఆనందం వెల్లివిరిసి, సుఖశాంతులు నెలకొనాలని కేతావత్ బీల్యా నాయక్ కోరుకున్నారు.



దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 7 (జనంసాక్షి)



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం, చెడుపై మంచి సాధించిన విజయాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు. దీపాల కాంతులతో ప్రతి ఇల్లు ప్రకాశించే ఈ పండుగ ప్రజల మధ్య ప్రేమానురాగాలు, ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. దీపావళి పండుగ ప్రతి కుటుంబానికి నూతనోత్సాహాన్ని, మంచి భవిష్యత్తును అందించాలని, రైతులు, కార్మికులు, వ్యాపారులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో అభివృద్ధి, ప్రగతి వెల్లివిరియాలని అభిలషించారు. పండుగను కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని కాలుష్యాన్ని తగ్గించే పర్యావరణహిత టపాసులనే వినియోగించాలని, చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు పర్యవేక్షిస్తూ తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీపావళి పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, సరికొత్త వెలుగులు నింపాలని నామ ఆకాంక్షించారు.

ద్వారకానగర్ డ్రైనేజీ సమస్యపై ఎమ్మెల్యే తక్షణ స్పందన

స్వయంగా పనులను పరిశీలించి సమస్య పరిష్కారానికి ఆదేశాలు

భద్రాచలం నవంబర్ 07 (జనంసాక్షి)
భద్రాచలం పట్టణంలోని ద్వారకానగర్ కాలనీలో డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తూ స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యపై ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తక్షణమే స్పందించారు. కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. దీంతో గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది హుటాహుటిన కాలనీకి చేరుకుని మురుగునీటి కాలువను శుభ్రం చేసే పనులు చేపట్టారు. మురుగునీరు రహదారిపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. డ్రైనేజీ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యేలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే స్పందించి స్వయంగా పనులను పర్యవేక్షించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.



రైతులకు నష్టపరిహారం, పంట రుణాలు రిషెడ్యూల్ చేసి వడ్డీ మాఫీ చేయాలి: ఎమ్మెల్సీ సత్యం

చండూరు, నవంబర్ 7 (జనంసాక్షి)

ఎలినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. కరువు నివారణ చర్యలు చేపట్టడంతో పాటు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేల చొప్పున పత్తి పంటకు, రూ.40 వేల చొప్పున వరి పంటకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. చండూరులో శనివారం నిర్వహించిన సిపిఐ మునుగోడు నియోజకవర్గ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా కరువు ప్రభావిత మండలాలు మునుగోడు నియోజకవర్గం లోనే ఉన్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం రైతుల పరిస్థితిపై తగిన స్థాయిలో స్పందించడం లేదని అన్నారు. ఎండిపోయిన పంటలతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులపై ఉన్న పంట రుణాలను తక్షణమే రీషెడ్యూల్ చేయాలని, రుణాలపై వడ్డీని పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని, రైతులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ



సభ్యులు ఆర్. అంజయ్యచారి, గురుజ రామచంద్రం, బొలుగూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, టి. రాములు, సూర్గి చలపతి, బొమ్మరబోయిన లాలు, ఈదుల బిక్షంరెడ్డి, చాపల శ్రీను, సూదన పోయిన రమేష్, బుర్ర శేఖర్, భీమనపల్లి రమేష్, గిరి రమ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న ముందస్తు దీపావళి వేడుకలు

నడిగూడెం (జనంసాక్షి) :

నడిగూడెం శ్రీ సాయి పబ్లిక్ స్కూల్లో శనివారం నిర్వహించిన ముందస్తు దీపావళి వేడుకలు ఆకట్టుకున్నాయి .దీపావళి పండగ గుర్తుగా దీపము, స్పష్టిక్ ఆకారంలో విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా దీపావళి పండుగ ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ బుస్సా సులోచన, కరస్పాండెంట్ మహేష్‌లు వివరించారు.ఈ సందర్భంగా టపాసులు బాంబులు పేల్చి విద్యార్థులు ఆనంద ఉత్సవాలతో దీపావళి వేడుకలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిరాజ్, సైదులు ,నాగరాజు, లక్ష్మి, జ్యోతి, భవాని, రజియా, మల్లిక, నాగమణి, సాజిదా, స్వప్న ,వీర కుమారి ,విజయ మౌనిక పాల్గొన్నారు.

నూతన కాంగ్రెస్ మండల కమిటీ నియామకం



భూదాన్ పోచంపల్లి, నవంబర్ 7 (జనంసాక్షి):

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిల ఆదేశాల మేరకు నూతన మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ తెలిపారు. వైస్ ప్రెసిడెంట్లుగా గట్టు రాంరెడ్డి, కాసుల బాలకృష్ణ గౌడ్, జనరల్ సెక్రెటరీలుగా పడాల సతీష్ చారి, బోదాసు ఈదయ్య, బద్దం రాజేశ్వర్ గౌడ్, కంటే లింగస్వామి యాదవ్, సెక్రెటరీలుగా రేవల్లి యాదగిరి, బంటు గణేష్, గుర్రం సత్యపాల్ రెడ్డి, కందాల గణేష్, పగుడాల అంజయ్య, కొత్తపల్లి శ్రీశైలం ఎంపికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గంగాదేవి నరసింహ, దోసపాటి రాజు, దుర్గం పాపయ్య, కాసుల సత్తయ్య, కే. గోవర్ధన్ గౌడ్, శాపాక కిష్టమ్మ, కుంభం శ్రీలత, రావుల సంధ్య, పగిళ్ల సాయిప్రియ రెడ్డిలు నియమితులయ్యారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ కృషి చేయాలని ఆయన కోరారు.

రక్తదానంతో ప్రాణదానం..

చామలేడులో 35 మంది యువత రక్తదానం

గుర్రంపోడు, నవంబర్ 7, (జనంసాక్షి)



గుర్రంపోడు మండలం చామలేడు గ్రామంలో శ్రీ రక్ష ట్రస్ట్ నల్లగొండ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శనివారం రోజున నిర్వహించారు. ఈ శిబిరానికి చామలేడు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన కొప్పోలు, చామలోని బావి తదితర ప్రాంతాల నుంచి యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శ్రీ రక్ష ట్రస్ట్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 35 మంది యువకులు బ్లడ్ డొనేషన్ చేసి తమ ఉదారతను చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇస్రో సైంటిస్ట్ సాయి ధీరజ్ కౌశిక్, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త అన్నేపర్తి శివాజీ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా శివాజీ శర్మ మాట్లాడుతూ.. బ్లడ్ డొనేషన్ ప్రాణదానంతో సమానమని కొనియాడారు. సైంటిస్ట్ సాయి ధీరజ్ కౌశిక్ మాట్లాడుతూ సోషల్ సర్వీస్‌లో యువత ఎల్లప్పుడూ ముందుండాలని, శ్రీ రక్ష ట్రస్ట్ నల్లగొండ ఇలాంటి ఉదాత్తమైన క్యాంపులు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి దోటి చంద్రమౌళి, వార్డ్ మెంబర్ ఆవుల రాంబాబు, రేషన్ డీలర్ పగిళ్ల రమేష్, సిరాజ్, దాము యాలాద్రి, దోటి శ్రీను, దోటి గణేష్, దోటి శ్రీను సి ఎ, ఆవుల సైదులు, దాము లింగస్వామి, జక్కుల శివ, మామిళ్ళ శ్రీకాంత్, సిలువేరు గోవర్ధన్, ఇటికాల శివాజీ, పల్లెబోయిన శ్రీనాథ్, మామిళ్ళ లింగస్వామి, పావుల విజయ్, పగిళ్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి శ్రీ రక్ష ట్రస్ట్ ఫౌండర్ శ్రీకాంత్ యాదవ్, ట్రస్ట్ ప్రతినిధులు హరీష్, రాజు, ప్రదీప్, స్వామి ఆర్గనైజర్లుగా వ్యవహరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేసిన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి



సూర్యాపేట (జనంసాక్షి): సూర్యాపేట పట్టణానికి చెందిన కొలిపాక రమేష్ మే నెలలో హార్ట్ ఎటాక్ తో సూర్యాపేట పట్టణంలోని ఆర్వీ హాస్పిటల్ లో చికిత్స పొందారు.రమేష్ ఆర్థిక పరిస్థితిని పీఆర్టీయు టీఎస్ జిల్లా అధ్యక్షులు తంగెళ్ల జితేందర్ రెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అట్టి వైద్య ఖర్చులకు సంబంధించి మంజూరు చేయించిన చెక్ ను హైదరాబాద్ లో అందజేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డికి రమేష్ కుటుంబ సభ్యులు, పీఆర్టీయూ సూర్యాపేట జిల్లా శాఖ తరుపున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఆర్టీయు జిల్లా అధ్యక్షులు తంగెళ్ల జితేందర్ రెడ్డి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కొట్టే శంకర్, హైదరాబాద్, నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తుమ్మల సురేందర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంజి శంకర్, చివ్వెంల మండల శాఖ అధ్యక్షులు షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

భూతరాజు భరత్ జన్మదినం సందర్భంగా ఘనంగా రక్తదాన శిబిరం

సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు ప్రశంసలు కురిపించిన ప్రజలు

కొండమల్లేపల్లి, నవంబర్ 7 (జనంసాక్షి):



భారతీయ జనతా పార్టీ కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు భూతరాజు భరత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని బ్రదర్స్ బ్లడ్ డొనేషన్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి చౌరస్తాలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ లాలు నాయక్ రంగారెడ్డి జిల్లా సెక్రటరీ నరేష్ యాదవ్, నల్గొండ జిల్లా మాజీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్ సంయుక్తంగా పాల్గొని మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకోవాలని నిర్వాహకులు తెలిపారు. రక్తదానం మహాదానం ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం అనే నినాదంతో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా సామాజిక సేవా భావాన్ని చాటుకున్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమని పలువురు నాయకులు, పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరానికి సహకరించిన వైద్య సిబ్బందికి, రక్తదాతలకు, నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జంగిటి మల్లేష్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నం పద్మావతి, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు నెల్లికంటి గోపి, సున్న మహేష్, యువమోర్చా మండల అధ్యక్షుడు గణేష్ యాదవ్, దాసు గురుస్వామి, పరమేష్ గురుస్వామి, అంజన్ సాయి ఉదయ చందు నాగ మధు హేమంత్ వేణు వంశీ విజయ నాయక్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరువు కాటులో కేబీ పల్లి.. వేసవి నీటి ఎద్దడిపై ముందస్తు అవగాహన!

కేబీ పల్లిలో ఉపాధి హామీ పనుల వద్ద సర్పంచ్ పందుల జయలక్ష్మి పాండు గౌడ్ సూచనలు

మర్రిగూడ, నవంబర్ 7 (జనంసాక్షి)



ప్రభుత్వం మర్రిగూడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో రానున్న వేసవిలో నీటి కొరత తీవ్రతరం అయ్యే అవకాశాలపై గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని కేబీ పల్లి సర్పంచ్ పందుల జయలక్ష్మి పాండు గౌడ్ సూచించారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించిన ఆమె, కూలీలకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు.మర్రిగూడ మండలంలో ఇప్పటికే కరువు పరిస్థితులు నెలకొన్నందున వేసవికాలం వరకు నీటి ఎద్దడి ప్రజలకు ప్రధాన సమస్యగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకునే పరిస్థితులను వివరించి, తాగునీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయం, పశువుల సంరక్షణలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికతో వ్యవహరించాలని తెలిపారు.గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రసన్నబాబు, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహ, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత, వార్డు సభ్యులు రజిత, రామేశ్వరి, అరుణ, పౌనిక, శిరీష, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు. ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు సదస్సులో పాల్గొన్నారు.





8వ డివిజన్‌లో..

కిషోర్ బాబు దూకుడు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఖమ్మం నగరంలో బీఆర్ఎస్ పార్టీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నగరంలోని 8వ డివిజన్‌లో డివిజన్ ఓటర్ల నమోదు ఇంచార్జి దేవభక్తుని కిషోర్ బాబు తనదైన కార్యాచరణతో ముందుకు సాగుతూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. డివిజన్ పరిధిలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఇంటింటికీ తిరిగి వారిని ఓటర్లుగా నమోదు చేయించడంలో చురుకైన పాత్ర పోషించారు. తక్కువ వ్యవధిలోనే ఏకంగా 403 పట్టభద్రుల నమోదు దరఖాస్తులను సేకరించి పార్టీ నాయకత్వానికి అందజేశారు. కిషోర్ బాబు నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమం డివిజన్‌లో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఖమ్మం, (జనంసాక్షి)

403 పట్టభద్రుల ఓట్ల నమోదు

ఖమ్మం నగరంలో ప్రత్యేక గుర్తింపు

ఇంటింటికీ తిరిగి యువ గ్రాడ్యుయేట్లను చేర్పించిన వైనం

ప్రతి వీధిలో ప్రత్యేక బృందాలు

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మార్గదర్శకత్వంలో, ఖానాపురం హవేలీ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ సూచనల మేరకు కిషోర్ బాబు ఓటర్ల నమోదు కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించారు. డివిజన్‌లోని ప్రతి ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గోపాలపురం, ఎల్బీ నగర్ ప్రాంతాల్లో వాంకుడోత్ సురేష్ నేతృత్వంలో, వైఎస్సార్ కాలనీలో కందాల వీరేందర్ గౌడ్, బాలపేటలో మందనపు నరేష్ ఆధ్వర్యంలో బృందాలు ఇంటింటికీ వెళ్లాయి. అర్హులైన పట్టభద్రులను కలిసి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించాయి.

యువ గ్రాడ్యుయేట్లపై ప్రత్యేక దృష్టి


గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారిని మరోసారి సంప్రదించడంతో పాటు, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసుకున్న కొత్త పట్టభద్రులను గుర్తించడంపై కిషోర్ బాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఓటరు నమోదుకు అవసరమైన వివరాలను సేకరించి, దరఖాస్తుల ప్రక్రియలో వారికి సహకరించారు. చదువుకున్న యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరినీ కలిసి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఈ కృషి ఫలితంగానే 8వ డివిజన్‌లో 403 దరఖాస్తులు సేకరించగలిగారు.



పార్టీ నేతలకు 403 దరఖాస్తుల అందజేత

డివిజన్ వ్యాప్తంగా సేకరించిన 403 పట్టభద్రుల నమోదు దరఖాస్తులను దేవభక్తుని కిషోర్ బాబు తన బృందంతో కలిసి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్‌కు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి తరపున ఖానాపురం హవేలీ కో-ఆర్డినేటర్ బొల్లికొండ కార్తీక్‌కు వాటిని అప్పగించారు. తక్కువ సమయంలో ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు సేకరించి అందజేయడంపై పార్టీ నాయకులు కిషోర్ బాబు కృషిని అభినందించారు.

కిషోర్ బాబు నాయకత్వంలో ఐక్యంగా..



ఈ నమోదు కార్యక్రమంలో దేవభక్తుని కిషోర్ బాబుతో పాటు డివిజన్ బీఆర్ఎస్ నాయకులు బానోత్ శివ, ఎస్‌కే రహీం, వడ్రనపు శ్రీనివాసరావు, రెంటపల్లి రమేష్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, పమ్మి రమేష్, పలిమేల ప్రవీణ్, అజ్మీరా గాంధీ, ఎస్‌కే ఈసబ్ తదితరులు పాల్గొన్నారు. కిషోర్ బాబు పర్యవేక్షణలో బృందాలుగా ఏర్పడి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 403 దరఖాస్తుల సేకరణతో 8వ డివిజన్‌లో కిషోర్ బాబు చేసిన కృషి పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

హుజూర్‌నగర్ బాలికల పాఠశాల అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ

రూ.30 లక్షలతో చేపట్టిన పనులు నవంబర్ 20లోపు పూర్తి చేయాలి : సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

హుజూర్‌నగర్ నవంబర్ 7 (జనంసాక్షి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. నెక్ట్ జనరేషన్ సూర్యాపేట కార్యక్రమంలో భాగంగా పాఠశాల అభివృద్ధికి మంజూరైన రూ.30 లక్షల నిధులతో చేపడుతున్న సివిల్ వర్క్స్, మేజర్, మైనర్ మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల క్రీడా మైదానాన్ని చదును చేసి బేస్‌బాల్, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన అన్ని అభివృద్ధి పనులను నవంబర్ 20వ తేదీలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ స్వయంగా పాఠాలు బోధిస్తూ ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల ప్రతిభపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దాడి నర్సిరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్, డిఈ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కరాటే పోటీల్లో పెనుబల్లి విద్యార్థికి గోల్డ్ మెడల్

పెనుబల్లి, నవంబర్ 7 (జనంసాక్షి) : పెనుబల్లి బీసీ కాలనీకి చెందిన భూక్యా రిషి రామ్ నాయక్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఎస్‌జీఎఫ్ తెలంగాణ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించడంతో పాటు గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. తద్వారా జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. కరాటే మాస్టర్ బాలకృష్ణ సారథ్యంలో శిక్షణ పొందుతున్న రిషి రామ్ నాయక్ రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఈ విజయాన్ని సాధించాడు. ప్రస్తుతం పెనుబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతున్న రిషి రామ్ నాయక్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ విజయం సాధించి కళాశాలకు, పెనుబల్లి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థి విజయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



జనంసాక్షి

పాల్వంచ మండలంలో ఉద్రిక్తత..
వృద్ధుడిపై చెప్పుతో దాడి, కత్తితో బెదిరింపులు

- కోడిపుంజులవాగు గ్రామంలో ఘటన
- ఎస్ హెచ్ఓకు బాధితుడు తేజావత్ సక్రు ఫిర్యాదు

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 7 (జనంసాక్షి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పరిధిలోని కోడిపుంజులవాగు గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణ స్థానికంగా కలకలం రేపింది. ఓ వృద్ధుడిపై దుండగులు దాడికి పాల్పడి, కత్తితో చంపుతానని బెదిరించిన ఘటనపై బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

బాధితుడు తేజావత్ సక్రు ఏ సాడు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం...

గ్రామానికి చెందిన తేజావత్ సక్రు (68, వ్యవసాయం) గత నవంబర్ 6వ తేదీ మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన తేజావత్ పార్వతి ఇంటి ముందు, తేజావత్ శ్రీనుతో కలిసి కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన భూక్య నరేష్ (గ్రా/నీ రాంజీ) అక్కడికి వచ్చి సక్రును బూతులు తిట్టడం ప్రారంభించాడు."ఎందుకు నన్ను తిడుతున్నావ్?" అని సక్రు నిలదీయగా... తన అన్న తనకు డబ్బులు ఇస్తా అంటే నువ్వే ఇవ్వకుండా అడ్డుపడుతున్నావంటూ నరేష్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. సక్రు మరియు శ్రీనులు అతన్ని వారించే ప్రయత్నం చేయగా, నరేష్ తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతూ తన కాలే చెప్పు తీసుకొని సక్రు చెంపపై కొట్టాడు.అంతటితో ఆగకుండా, అదే సమయంలో అక్కడ ఉన్న తేజావత్ శ్రీను షాపులో నుంచి కత్తి తీసుకుని సక్రు పైకి వచ్చి "నిన్ను ఈరోజు ఎలాగైనా చంపేస్తా" అంటూ ప్రాణభయం కల్గించేలా బెదిరించాడు. దీంతో భయపడిపోయిన సక్రు అక్కడి నుంచి తన ఇంటికి వెళ్లిపోయాడు.

అయితే, అదే రోజు సాయంత్రం 7 గంటల ప్రాంతంలో నిందితుడు నరేష్ మళ్లీ కత్తి పట్టుకుని సక్రు ఇంటికి వెళ్లాడు. అక్కడ సక్రు కనిపించకపోవడంతో, ఆయన భార్య ద్వాలితో గొడవపడి ఆమెను కూడా చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులతో సంప్రదించి, విషయన్ని బేరీజు వేసుకుని ఆలస్యంగా స్టేషన్‌కు రావడం జరిగిందని బాధితుడు తెలిపారు. తనపై బూతులు తిరుగుతూ చెప్పుతో కొట్టి, కత్తితో చంపుతానని బెదిరింపులకు పాల్పడిన భూక్య నరేష్ మరియు ఇతరులపై తక్షణమే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్‌ఓకు లిఖితపూర్వకంగా దరఖాస్తు అందజేశారు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.ల



ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మోడల్ స్కూల్ విద్యార్థులు

మునగాల, నవంబర్ 7(జనంసాక్షి):

పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్ మునగాల విద్యార్థులు శనివారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం సందర్శించారు. వొకేషనల్ ఎడ్యుకేషన్ – హెల్త్ కేర్ విభాగంలో నిర్వహించిన ఇండస్ట్రియల్ ఎక్స్పోజర్ విజిట్ లో భాగంగా విద్యార్థులకు ఆసుపత్రి సేవలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వొకేషనల్ ట్రైనింగ్ ఉపాధ్యాయురాలు విజయదుర్గ మాట్లాడుతూ, విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రత్యక్ష తర్ఫీదు కూడా ఎంతో అవసరమని అన్నారు. వొకేషనల్ ఎడ్యుకేషన్ లో హెల్త్ కేర్ విభాగంలో విద్యార్థులకు ఈ ఇండస్ట్రియల్ ఎక్స్పోజర్ విజిట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందే సేవలు, అత్యవసర విభాగం పనితీరును విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారన్నారు. వైద్య వృత్తి అంటే కేవలం ఉద్యోగం కాదు, అది ఒక గొప్ప సేవ అని విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఇలాంటి క్షేత్ర పర్యటనలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు ఇలాంటి నాణ్యమైన విద్యను అందించడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరబాబు, ఇంచార్జ్ రామకృష్ణ ఉపాధ్యాయులు ఎస్.కె. జాకీర్ , ఎస్.కె. షరీఫ్, రేణుక, విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు.



ప్రమాద బాధిత విద్యార్థినికి
ఎమ్మెల్సీ ఆర్థిక చేయూత
కీర్తి వైద్య ఖర్చులకు రూ.80 వేల సాయం

చింతపల్లి, నవంబర్ 07(జనంసాక్షి)

చింతపల్లి మండలం వీటీ నగర్ జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని కీర్తి ఇటీవల ప్రమాదానికి గురైన నేపథ్యంలో ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్సీ పిగిలి శ్రీపాల్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుతో పాటు నగదు రూపంలో మొత్తం రూ.80 వేల సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యలో రాణించి, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుని స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, చింతపల్లి పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

గోన రవీందర్రావు కుటుంబాన్ని పరామర్శించిన
ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల



కనగల్లు, నవంబర్ 7 **(జనంసాక్షి):**

బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గోన రవీందర్రావు మాతృమూర్తి తురకపల్లి మాజీ సర్పంచ్ గోన ఎల్లమ్మ ఈనెల 30న అనారోగ్యంతో మృతి చెందింది. మండలంలోని ఎం గౌరారం గ్రామంలో ఆమె దశదిన కర్మ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి లు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి గల నివాళులు అర్పించి. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. జి ఎడవెల్లి పిఎసిఎస్ చైర్మన్ దో టి. శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కరీం పాషా, ఎక్స్ వైస్ ఎంపీపీ రామగిరి శ్రీధర్ రావు, బి ఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు అయితగోని యాదయ్య గౌడ్, జొన్నలగడ్డ శేఖర్ రెడ్డి, సర్పంచులు కారింగ్ జానయ్య గౌడ్, ఊరే లింగయ్య, బోయలపల్లి జానయ్య గౌడ్, పులకరం అండాలు వెంకటేశం, ఎం గౌరారం ఉపసర్పంచ్ బీరెల్లి నాగరాజు, మాజీ సర్పంచులు కడారి కృష్ణయ్య, నాగులవంచ శేఖర్ రావు, నాగులవంచ వెంకటేశ్వరరావు, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కటికం సత్తయ్య గౌడ్, మారగొని గణేష్, దండంపెల్లి సత్తయ్య, బి దేవేందర్, రావుల శ్రీనివాస్ రెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, సుంకి రెడ్డి వెంకట్ రెడ్డి, జోగు దయాకర్, ఆత్మీయ బంధుమిత్రులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు,



ఆర్డీఓకు ఆర్టీఐ చట్టం అమలుపై విజ్ఞప్తి
ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి
డా. కొర్ర కిషన్ నాయక్

దేవరకొండ, నవంబర్ 07 (జనంసాక్షి):



దేవరకొండ నూతన ఆర్డీఓ బత్తుల వనజ రాణిని ఆర్టీఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం?2005 అమలును మరింత సమర్థవంతంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ సమాచార బోర్డులు ఏర్పాటు చేసి, ప్రజా సమాచార అధికారులు , మొదటి అప్పీలేట్ అధికారుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని కోరారు. అలాగే చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన సమాచారాన్ని కార్యాలయాల నోటీసు బోర్డులు, అధికారిక వెబ్‌సైట్లలో ప్రచురించాలని సూచించారు.ఈ చర్యలతో ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని పేర్కొంటూ, చట్ట అమలుపై అధికారులకు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని ఆర్డీఓను కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్టీఐఏఎస్ రాష్ట్ర కార్యదర్శి పులిజాల గోవర్ధన్, జిల్లా నాయకులు లావుడి భాషా నాయక్, మహేష్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు సిద్దిక్ సేవలు మరువలేనివి
సిద్దిక్ మృతి తీరని లోటు..
ఎమ్మెల్యే బాలు నాయక్

చింతపల్లి, నవంబర్ 07(జనంసాక్షి)

చింతపల్లి మండలం తీదేడు గ్రామానికి చెందిన మలక్‌పేట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అక్బర్ తండ్రి షేక్ సిద్దిక్ మృతి పట్ల దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. షేక్ సిద్దిక్ పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయతతో ఉంటూ, అంకితభావంతో సేవలందించిన షేక్ సిద్దిక్ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన మృతి ఎంతో బాధాకరమని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కొండూరు పవన్ కుమార్, అంగిరేకుల నాగభూషణం, ఏడుపుల గోవింద్ యాదవ్, కాయితీ జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్ యాదవ్, మాస భాస్కర్, అంగిరేకుల గోవర్ధన్, మారయ్య, శంకర్, బాలేమియా, రాకేష్, లక్ష్మయ్య, హేము, మధు, నేనావత్ భరత్ కుమార్, నడింపల్లి సత్యం గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చండూరులో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం..
క్రెటా కారు నుజ్జునుజ్జు!
పార్క్ చేసిన కారును ఢీకొట్టిన మరో వాహనం..
సీసీ కెమెరాల్లో రికార్డైన ఘటన

చండూరు, నవంబర్ 7 (జనంసాక్షి)

చండూరు పట్టణంలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలోని మార్కెట్ ఎదురుగా ప్రధాన రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి 12:23 గంటల సమయంలో వేగంగా వచ్చిన ఓ మహీంద్రా వాహనం రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న క్రెటా కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్రెటా కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమై నుజ్జునుజ్జయింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి సంబం ధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియోలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి. రాత్రి వేళల్లో వాహనదారులు అతివేగంతో వాహనాలు నడపడం వల్ల ఇలాంటి ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని, వాహనదారులు రహదారులపై అప్రమత్తంగా వ్యవహరించాలని కోరుతున్నారు.



అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే

కఠిన చర్యలు

- భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందే..
- దుకాణదారులకు బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ హెచ్చరిక



బూర్గంపహాడ్ నవంబర్ 07 (జనంసాక్షి) దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా విక్రయించే దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ హెచ్చరించారు. ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయాలు చేపడితే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యాపార లాభాల కోసం నిబంధనలను విస్మరించరాదని సూచించారు. బాణసంచా విక్రయాలకు సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు, చట్టబద్ధమైన లైసెన్సులు పొందిన దుకాణాల్లోనే విక్రయాలు జరపాలని తెలిపారు. ప్రతి దుకాణంలో అగ్నిమాపక పరికరాలు, ఇసుక బకెట్లు, నీటి డ్రమ్ములు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దుకాణాల పరిసరాల్లో ధూమపానం, అగ్గిపుల్లలు వెలిగించడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా వైరింగ్, విద్యుత్ పరికరాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అనుమతించిన నాణ్యమైన బాణసంచాను మాత్రమే విక్రయించాలని, నిషేధిత బాణసంచా అమ్మకాలు చేపట్టరాదని హెచ్చరించారు. చిన్నారులు బాణసంచా కొనుగోలు చేసే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు పర్యవేక్షణ ఉండేలా చూడాలని సూచించారు. పోలీస్, అగ్నిమాపక శాఖల అత్యవసర ఫోన్ నంబర్లు అందరికీ కనిపించేలా దుకాణాల వద్ద ప్రదర్శించాలని తెలిపారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మేడా ప్రసాద్ స్పష్టం చేశారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున బాణసంచా విక్రయదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

కరువు మండలాలలో సహాయక చర్యలు

చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

మండల బిఆర్ఎస్ పార్టీ డిమాండ్

మునగాల, నవంబర్ 7(జనంసాక్షి):

రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకున్నది తప్ప, కరువు మండలాలకు ప్రత్యేక నిధులు విడుదలచేసి ప్రజల్ని ఆదుకోవడంలో మాత్రం పూర్తిగా విఫలం అయిందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకర అజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్ లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ పార్టీ సారధ్యంలోని రేవంత్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం పూర్తిస్థాయిలో కుదేలైందని, అన్నదాత సేద్యం లేక ఉన్న కొద్దిపాటి సేద్యాన్ని చేసి ఆర్థికంగా అప్పులపాలై రాష్ట్రవ్యాప్తంగా అన్ని వ్యవస్థలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి అన్నారు. కరువు ఛాయాల్లో ఉన్న ప్రజల్ని కాపాడేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. తక్షణమే కరువు మండలాలలో, గ్రామాల వారీగా కరువు నిధులు విడుదల చేసి, ప్రజల్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు, అదేవిధంగా వరి సేద్యం చేసినప్రతి రైతుకు ఎకరానికి 30 వేల రూపాయల పంట నష్టపరిహారం చెల్లించాలని, వాణిజ్య పంటల సేద్యం చేసిన రైతులకు 50 వేల రూపాయల నష్టపరిహారం అందించాలని వారుడిమాండ్ చేశారు. అదేవిధంగా కరువు మండలాలలో విబిజి, రామ్ జి ఉపాధి హామీ పనుల్లో ప్రతి కూలికి 200 రోజుల పని కల్పించి, 5 వందల రూపాయల కనీస కూలి అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కరువు గ్రామాలలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఇబ్బంది, విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మునగాల పిఏసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి కోల ఉపేందర్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉడుం కృష్ణ, ఎల్పి రామయ్య, గడ్డం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



బాణాసంచా దుకాణాల్లో నిబంధనలు పాటించాలి

సిగరెట్, బీడీలు తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: ఎస్ఐ జి. నరేష్

చింతకాని, నవంబర్ 07,(జనం సాక్షి)

దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చింతకాని ఎస్ఐ జి. నరేష్ సూచించారు. బాణాసంచా దుకాణాల వద్ద ఎలాంటి అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.దుకాణాల వద్ద ఇసుక, నీటి డ్రమ్ములను అందుబాటులో ఉంచుకోవాలని, అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే నియంత్రించేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దుకాణాల సమీపంలో ఎవరూ సిగరెట్, బీడీలు తాగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాణాసంచా దుకాణాల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా విక్రయాలు నిర్వహించినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత దుకాణదారులపై చట్టప్రకారం చర్యలు తప్పవని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని దుకాణదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.





రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఎంపిక

కోదాడ (జనం సాక్షి):

తెలంగాణ సాంస్కృతిక కళలకు జీవం పోసి, రంగస్థల కళలను ప్రదర్శించిన విద్యార్థులు అభినందనీయులని, పల్లె జీవన విధానాన్ని కళ్ళకు కట్టినట్టు నృత్యం ద్వారా ప్రదర్శన చేయడం అద్భుత కళ అని కె. ఆర్. ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి అన్నారు. యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో జరిగిన సూర్యాపేట జిల్లా స్థాయి యువజన ఉత్సవాలలో కోదాడలోని కె.ఆర్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ విద్యార్థులు నృత్య పోటీలలో ప్రథమ బహుమతి గెలుచుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వినీత, ముత్యాల ప్రణతి , లావణ్య, లక్ష్మీ ప్రసన్న, సింధు లను సందర్భంగా కళాశాలలో అభినందించారు. కళాశాల మరో విద్యార్థిని కవిత్వ రచన పోటీలలో ఆర్.యోగేశ్వరి తృతీయ బహుమతిని గెలుచుకోవడం అభినందనీయమని అన్నారు. త్వరలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలలో పాల్గొనేందుకు ఎంపిక కావడం సంతోషమని, ఇదే ఉత్సాహంతో రాష్ట్రస్థాయిలో గెలుచుకొని జిల్లాకు పేరు తీసుకుని రావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా టీం లీడర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వేముల వెంకటేశ్వర్లను అభినందించారు. అభినందించిన వారిలో అధ్యాపకులు ఆర్. పిచ్చి రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కె .శాంతయ్యలతో పాటుగా కళాశాల సిబ్బంది అభినందించారు. విద్యార్థులకు అన్ని రకాలుగా సహకరించిన ఎస్టీ బాలికల వసతి గృహ వార్డెన్ పద్మకు కృతజ్ఞతలు తెలిపారు.



పాలోంచలో ఘనంగా

శ్రీచైతన్య పాఠశాలలో దీపావళి సంబరాలు

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 7, (జనంసాక్షి):

పాల్వంచ పట్టణం ఒడ్డుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి నిర్మలారాణి మాట్లాడుతూ.. దీపావళి అంటే దీపాల వరుస అని, సంస్కృతంలో దీప (దీపం), ఆవళి (వరుస) అనే పదాల నుండి ఇది ఏర్పడిందని వివరించారు. ఇది స్వచ్ఛమైన తెలుగు పదమని, అజ్ఞాన నాశనానికి, ధర్మ ప్రతిష్టకు గుర్తింపుగా అమావాస్య నాడు ఈ పండుగను జరుపుకుంటామని తెలిపారు. దీపావళి చుట్టూ అనేక కథలు ఉన్నాయని, శ్రీకృష్ణుడు సత్యభామ సహాయంతో నరకాసురుడిని వధించడం వల్ల ప్రజలు ఆనందంతో మరుసటి రోజు దీపావళి జరుపుకుంటారని ఒక కథ ప్రాచుర్యంలో ఉందని పేర్కొన్నారు. అలాగే లంకలో రావణుడిని సంహరించి రాముడు సీతా సమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు ఆనందంతో ఈ పండుగను జరుపుకుంటారని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్తగూడెం జోన్ ఏ.జి.యం వీరన్న గారు మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందే ఈ పండుగను భారతీయులందరూ ఆనందోత్సాహాలతో కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సంయుక్తంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. దీపావళి వెలుగులు మనలోని అజ్ఞానాన్ని తొలగించి, నూతన ఉత్తేజాన్ని నింపుతాయని తెలిపారు. ?ఈ కార్యక్రమంలో ప్రైమరీ ఇన్‌ఛార్జ్ షేక్ సిరాజ్ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

టేకులచెరువు పంచాయతీలో రసీదు పుస్తకాల

చోరీపై సమగ్ర విచారణ చేపట్టాలి

- సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్

బూర్గంపహాడ్ నవంబర్ 07 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- టేకులచెరువు గ్రామపంచాయతీ కార్యాలయంలో తాళాలు పగలగొట్టి దొంగలు చొరబడి 2022 నుంచి 2025 వరకు సంబంధించిన ఇంటి పన్నుల రసీదు పుస్తకాలను ఎత్తుకెళ్లిన ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించి అరెస్టు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గతంలో పంచాయతీకి సంబంధం లేకుండా రసీదు పుస్తకాలు ముద్రించి ఇంటి పన్నులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఈ విషయాన్ని సర్పంచ్ బోళ్ల సైదమ్మ ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లేదని విమర్శించారు. పంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలపై వివరాలు బయటపడకుండా రసీదు పుస్తకాలను మాయం చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ వ్యవహారాలు తెలిసిన వ్యక్తుల ప్రమేయం ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని దొంగతనానికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, పాండవుల రామనాథం, ఎస్.కె. ఆబీద్, గుంటక కృష్ణ, టేకులచెరువు శాఖ కార్యదర్శి బోళ్ల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి

8వ డివిజన్‌లో కిషోర్ బాబు దూకుడు

- 403 పట్టభద్రుల ఓట్ల నమోదు..
- ఖమ్మం నగరంలో ప్రత్యేక గుర్తింపు..
- ఇంటింటికీ తిరిగి యువ గ్రాడ్యుయేట్లను చేర్పించిన వైనం

ఖమ్మం, (జనంసాక్షి) :

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ఖమ్మం నగరంలో బీఆర్ఎస్ పార్టీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నగరంలోని 8వ డివిజన్‌లో డివిజన్ ఓటర్ల నమోదు ఇంచార్జి దేవభక్తుని కిషోర్ బాబు తనదైన కార్యాచరణతో ముందుకు సాగుతూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. డివిజన్ పరిధిలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఇంటింటికీ తిరిగి వారిని ఓటర్లుగా నమోదు చేయించడంలో చురుకైన పాత్ర పోషించారు. తక్కువ వ్యవధిలోనే ఏకంగా 403 పట్టభద్రుల నమోదు దరఖాస్తులను సేకరించి పార్టీ నాయకత్వానికి అందజేశారు. కిషోర్ బాబు నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమం డివిజన్‌లో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది.



ప్రతి వీధిలో ప్రత్యేక బృందాలు

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మార్గ దర్శకత్వం లో, ఖానాపురం హవేలీ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ సూచనల మేరకు కిషోర్ బాబు ఓటర్ల నమోదు కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించారు. డివిజన్‌లోని ప్రతి ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గోపాలపురం, ఎల్బీ నగర్ ప్రాంతాల్లో వాంకుడోత్ సురేష్ నేతృత్వంలో, వైఎస్సార్ కాలనీలో కందాల వీరేందర్ గౌడ్, బాలపేటలో మందనపు నరేష్ ఆధ్వర్యంలో బృందాలు ఇంటింటికీ వెళ్లాయి. అర్హులైన పట్టభద్రులను కలిసి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించాయి.

యువ గ్రాడ్యుయేట్లపై ప్రత్యేక దృష్టి

గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారిని మరోసారి సంప్రదించడంతో పాటు, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసుకున్న కొత్త పట్టభద్రులను గుర్తించడంపై కిషోర్ బాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఓటరు నమోదుకు అవసరమైన వివరాలను సేకరించి, దరఖాస్తుల ప్రక్రియలో వారికి సహకరించారు. చదువుకున్న యువత ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరినీ కలిసి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఈ కృషి ఫలితంగానే 8వ డివిజన్‌లో 403 దరఖాస్తులు సేకరించగలిగారు.

పార్టీ నేతలకు 403 దరఖాస్తుల అందజేత

డివిజన్ వ్యాప్తంగా సేకరించిన 403 పట్టభద్రుల నమోదు దరఖాస్తులను దేవభక్తుని కిషోర్ బాబు తన బృందంతో కలిసి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్‌కు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి తరఫున ఖానాపురం హవేలీ కో-ఆర్డినేటర్ బొల్లికొండ కార్తీక్‌కు వాటిని అప్పగించారు. తక్కువ సమయంలో ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు సేకరించి అందజేయడంపై పార్టీ నాయకులు కిషోర్ బాబు కృషిని అభినందించారు.

కిషోర్ బాబు నాయకత్వంలో ఐక్యంగా..

ఈ నమోదు కార్యక్రమంలో దేవభక్తుని కిషోర్ బాబుతో పాటు డివిజన్ బీఆర్ఎస్ నాయకులు బానోత్ శివ, ఎస్‌కే రహీం, వడ్రనపు శ్రీనివాసరావు, రెంటపల్లి రమేష్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, పమ్మి రమేష్, పలిమేల ప్రవీణ్, అజ్మీరా గాంధీ, ఎస్‌కే ఈసబ్ తదితరులు పాల్గొన్నారు. కిషోర్ బాబు పర్యవేక్షణలో బృందాలుగా ఏర్పడి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 403 దరఖాస్తుల సేకరణతో 8వ డివిజన్‌లో కిషోర్ బాబు చేసిన కృషి పార్టీ వర్గాల్లో చర్చ నీయాంశంగా మారింది.



త్రివేణి పాఠశాలలో ఘనంగా సర్ సి.వి. రామన్ జయంతి వేడుకలు

ఖమ్మం, (జనంసాక్షి) :

ప్రముఖ భారతీయ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సర్ చంద్రశేఖర వెంకట రామన్ జయంతిని పురస్కరించుకుని ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన జీవితం, శాస్త్రరంగంలో చేసిన పరిశోధనలు, రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణ గురించి విద్యార్థులకు వివరించారు.డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ.. సర్ సి.వి. రామన్ సాధించిన విజయాలు ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. నిరంతర పరిశ్రమ, ఆసక్తి, పట్టుదలతోనే గొప్ప ఆవిష్కరణలు సాధ్యమవుతాయని, రామన్ జీవితం విద్యార్థులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నేత్రపర్వంగా నిత్యకల్యాణం

భద్రాచలం నవంబర్ 07 (జనంసాక్షి)

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణం శనివారం భక్తుల జయజయధ్వానాల మధ్య సంప్రదాయబద్ధంగా వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణ వేడుకను తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. కల్యాణోత్సవంలో భాగంగా అర్చకులు ముందుగా విశ్వక్సేన అర్చన, పుణ్యాహవాచనం నిర్వహించి, అనంతరం కంకణధారణ చేపట్టారు. శుభప్రదమైన జీలకర్ర బెల్లం ఘట్టం, మాంగల్యధారణ, తలంబ్రాల కార్యక్రమాలను వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వేద పండితులు స్వామివారికి వేద ఆశీర్వచనం అందించారు. ఈ కల్యాణ వేడుక భక్తులకు కనుల పండువగా నిలిచింది.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

చింతపల్లి, నవంబర్ 07(జనంసాక్షి)

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కేదాస్ మోహన్ మాదిగ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. నూతన మండల కమిటీ అధ్యక్షుడిగా కంబాలపల్లి రామకృష్ణ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కంబాలపల్లి రాజు మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కురుమేటి అయోధ్య మాదిగ, ఉపాధ్యక్షుడిగా నల్ల అంజయ్య మాదిగ, అధికార ప్రతినిధిగా గార్లపాటి శ్రీను మాదిగ, యూత్ అధ్యక్షుడిగా తంగేళ్ల అఖిల్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షుడు సహదేవుడు మాదిగ, రాష్ట్ర నాయకుడు ఎర్ర జగన్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు ఏసు మాదిగ, దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి మాదిగ పాల్గొని నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి ఉద్యమ అభినందనలు తెలియజేస్తూ, ఎమ్మార్పీఎస్ బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలని సూచించారు.



మంచానికే పరిమితమైన రోగికి

ఇంటి వద్దకే ఉచిత వైద్య సేవలు!

- ప్రజా వైద్య సేవల్లో ఆదర్శంగా నిలుస్తున్న సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రి
- ప్రతి నెలా అవసరమైన మందుల పంపిణీ ?
- మానవతా దృక్పథంతో వైద్య సిబ్బంది సేవలు.. గ్రామప్రజల ప్రశంసలు

తిరుమలాయపాలెం, నవంబర్ 7 (జనంసాక్షి):

ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయంగా నిలుస్తున్నాయి. అనారోగ్యంతో మంచానికే పరిమితమై ఆసుపత్రికి వెళ్లలేని రోగులను గుర్తించి, వారి ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందించడం ద్వారా వైద్య సిబ్బంది మానవతా దృక్పథాన్ని చాటుకుంటున్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా మందులు పంపిణీ చేస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో తమ వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.



తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గండమల్ల నవీన్ రోడ్డు ప్రమాదంలో వెన్నుముకకు తీవ్ర గాయం కావడంతో గత కొంతకాలంగా మంచానికే పరిమితమై జీవనం సాగిస్తున్నారు. నిత్యావసర పనులు సైతం ఇతరుల సహకారంతో చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో తన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలా అవసరమైన మందులను ఉచితంగా అందించాలని జిల్లా ఉన్నతాధికారులను ఆయన కోరారు.

నవీన్ విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా అధికారులు సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బందికి తగిన సూచనలు చేశారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది నవీన్ ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైన మందులను ప్రతి నెలా ఉచితంగా అందించేలా చర్యలు చేపట్టారు.

ఈ క్రమంలో సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వసుంధర, ఫార్మసిస్ట్ గంధసిరి లింగమూర్తి సూచనల మేరకు శనివారం డిసెంబర్ నెలకు సంబంధించిన అవసరమైన మందులను స్థానిక ఆశా కార్యకర్త దోమల్ల సత్యవతి ద్వారా నవీన్ ఇంటి వద్దకే పంపిణీ చేశారు. రోగి ఆసుపత్రికి రాలేని పరిస్థితుల్లో వైద్య సేవలే రోగి ఇంటి ముంగిటకు చేరడం విశేషంగా నిలుస్తోంది.

సాధారణంగా వైద్య సేవలు పొందేందుకు ఆసుపత్రులకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన రోగుల విషయంలో ఇలాంటి ఇంటి వద్ద వైద్య సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులు, శారీరక వైకల్యం, ప్రయాణ అసౌకర్యాలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది అందిస్తున్న ఈ సేవలు ఎంతో ఊరటనిస్తున్నాయి. రోగుల పట్ల బాధ్యత, సేవాభావం, మానవత్వం కలగలిపిన ఈ కార్యక్రమం ప్రజా వైద్య సేవలకు ఆదర్శంగా నిలుస్తోంది.

ఈ సందర్భంగా గండమల్ల నవీన్ మాట్లాడుతూ తన ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకుని, ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా అవసరమైన మందులు అందిస్తున్న సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వసుంధర, ఫార్మసిస్ట్ గంధసిరి లింగమూర్తి, ఆశా కార్యకర్త దోమల్ల సత్యవతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆసుపత్రికి రాలేని రోగి వద్దకే వైద్య సేవలను తీసుకెళ్లడం నిజమైన ప్రజా వైద్యానికి నిదర్శనమని గ్రామప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచేలా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని కోరుతున్నారు. సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది చూపుతున్న చొరవ, అంకితభావం ఇతర ప్రాంతాల వైద్య సిబ్బందికి కూడా స్ఫూర్తిదాయకమని గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు.

రోగి ఆసుపత్రికి రాలేకపోతే.. వైద్య సేవలే రోగి ఇంటికి చేరాలి అనే మానవతా సందేశాన్ని సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తమ సేవల ద్వారా చాటిచెబుతున్నారు.

గేదెల కొనుగోళ్లె అవినీతిపై కలెక్టర్ విచారణ చెయ్యాలని సిపిఎం డిమాండ్

ఎర్రుపాలెం,నవంబర్ 7 (జనంసాక్షి):

గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత, పాడి పరిశ్రమ అభివృద్ధి ధ్యేయంగా 'ఇందిరా మహిళా డెయిరీ పథకం' ను మహిళలను పాడి పారిశ్రామికవేత్తలుగా మార్చడానికి ఈ పథకాన్ని మధిర నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారని ఈ పథకంలో నాణ్యతలేని గేదెలు లబ్ధిదారులకు అంటగట్టడం వల్ల లబ్ధిదారుల పలువురి గేదలు,దూడలు మృతి చెందాయని, ఈ అవినీతిపై కలెక్టర్ సమగ్ర విచారణ చేయాలని ఎర్రుపాలెం మండలం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు డిమాండ్ చేస్తూ సిపిఎం నాయకులతో కలిసి శనివారం తాసిల్దార్ ఎలిజబెత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్దాల.ప్రభాకర్, మాట్లాడుతూ పథకం లో మహిళలు చేరాలంటే 2200 చెల్లించి లబ్ధిదారులుగా నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటన చేస్తే వేలాది మంది మహిళలు డబ్బులు చెల్లించి పథకంలో చేరిన పథకం అమలకు సంవత్సరాల పాటు కాలయాపన చేసి పథకం ప్రారంభించాక రాజకీయ జోక్యంతో ఇష్టానుసారంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని



అభాసపాలు చేశారని విమర్శించారు.ఈ పథకంలో డబ్బులు చెల్లించిన ప్రతి మహిళకు లబ్ధి చేకూరాలని డిమాండ్ చేశారు.ఇందిర మహిళా డెయిరీ (గేదల) కొనుగోళ్ల వ్యవహారం అవినీతికి చిరునామాగా మధ్యవర్తుల జోక్యం, కొనుగోలు కేంద్రాల మార్పు, కమిషన్ల బేరసారాలతో లబ్ధిదారులకు సబ్సిడీ పోను 50 వేల నుండి 1,30,000 లక్ష ముప్పై వేల వరకు లబ్ధిదారుల చేతుల నుంచి చెల్లించిన నాణ్యతలేని గేదెలను లబ్ధిదారులు గా ఉన్నా మాకు అంట అంటగట్టారని ఇంటికి వచ్చాక గేదలు పాలు ఇవ్వట్లేదని అనారోగ్య పాలయ్యాయని గేదలు, దూడలు దారి మధ్యలో ఇంటికి వచ్చాక చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గేదల, దూడలు మృతి చెందిన లబ్ధిదారు లకు వంద శాతం పూర్తి ఇన్సూరెన్స్ వెంటనే చెల్లించాలని నిబంధనలకు విరుద్ధంగా బాధ్యత రహితంగా వ్యవహరించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులకు నాణ్యమైన గేదెలు అందేలా చూడాలని వెంటనే కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, దూదిగం బసవయ్య, నాగులవంచ వెంకట్రామయ్య, నక్క.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వజ్ఞ పాఠశాలలో ఘనంగా 'దీపావళి' సంబరాలు

- జ్ఞానపు వెలుగులతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్

ఖమ్మం (జనంసాక్షి):



స్థానిక సర్వజ్ఞ పాఠశాలలో దీపావళి వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. పండుగను పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణలో హాజరవడంతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించు కుంది. విద్యార్థినులు తీర్చిదిద్దిన రంగు రంగుల రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. దీపావళి అంటే కేవలం దీపాల వెలుగులు మాత్రమే కాదని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు అజ్ఞానపు చీకట్లను తొలగించి, విజ్ఞానపు వెలుగులను సొంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా గ్రీన్ క్రాకర్స్ ఉపయోగిస్తూ, తగిన జాగ్రత్తలతో సురక్షితంగా దీపావళి జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. చిన్నారులు పర్యావరణహిత టపాకాయలు కాలుస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలి
ప్రతి ఇంటా ఆనందాల దీపాలు వెలగాలి
బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీజీఆర్ దీపావళి శుభాకాంక్షలు

గుర్రంపోడు: నవంబర్ 07 (జనంసాక్షి)

దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా ఆనందాల జ్యోతులు ప్రకాశించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీజీఆర్ ఆకాంక్షించారు. గుర్రంపోడు మండల ప్రజలకు, నియోజకవర్గ ప్రజలకు, యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పీజీఆర్ మాట్లాడుతూ.. దీపావళి అంటే కేవలం దీపాల పండుగ మాత్రమే కాదు.. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆశలు, ఆకాంక్షలకు కొత్త వెలుగులు నింపాలని, ప్రజలందరి ఇళ్లలో సిరిసంపదలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలి.. ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి అన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు.ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో, సురక్షితంగా జరుపుకోవాలని కోరారు.అలాగే సమాజంలో కులమతాలకు అతీతంగా ప్రేమాభిమానాలు, ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని, ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, ఆప్యాయతలతో



మెలగాలని పిలుపునిచ్చారు. దీపావళి వెలుగుల మాదిరిగానే ప్రతి ఒక్కరి జీవితాల్లో నిత్యం సంతోషాలు నిండాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పీజీఆర్ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

మార్గమధ్యంలో ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవ

కొత్తగూడెం జనం సాక్షి నవంబర్ 7



ఈరోజు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్రరావు పాల్వంచ నుంచి కొత్తగూడెం వస్తూ మార్గమధ్యలో బస్టాండు వద్ద ఉన్న టీ షాపు వద్ద ఆగి ప్రజలను కలిసి బాగున్నారా మీ గ్రామం అభివృద్ధి బాగుందా. గ్రామాల లో ఉన్నటువంటి రోడ్ల పరిస్థితులు ఏమిటి ఈ ప్రభుత్వ పాలనలో ఫలాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా. గ్రామ సర్పంచులు ఎలా ప్రవర్తిస్తున్నారు. మన ఖీూ పార్టీ సర్పంచులు ప్రభుత్వ అధికారులతో కొట్లాడి అభివృద్ధి చేయించే విధంగా చూడాలి. మాజీ మంత్రి,బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు గ్రామాలలో చేసినటువంటి అభివృద్ధి పనులను గుర్తు చేస్తూ పది నిమిషాల పాటు వారితో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల. చంద్రశేఖరరావుతొ కొట్లాడి కొత్తగూడెం అభివృద్ధి కోసం ఎంతో పాటు పడ్డారని, ఆయన ఉన్న హయాం లోనే గ్రామాల అభివృద్ధి తో పాటు రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సందర్భంగా తెలియజేశారు.

బాణసంచా ప్రమాదాల్లో చిన్నారుల కంటి చూపుకు భరోసా !
15 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత కంటి వైద్య సేవలు అవసరమైతే శస్త్రచికిత్స కూడా ఉచితం : డా. శివరాం

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 07 (జనంసాక్షి)

వాసన్ ఐ కేర్ ఖమ్మం బ్రాంచ్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో డాక్టర్ శివరాం మాట్లాడుతూ, దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చేటప్పుడు ప్రమాదవశాత్తు కంటి గాయాలకు గురయ్యే చిన్నారులకు అండగా నిలిచేందుకు వాసన్ ఐ కేర్ సంస్థ ప్రత్యేక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'సురక్షిత కళ్లు ? సురక్షిత దీపావళి (రాజీటవ ఇఎవబ, రాజీటవ ఆవవజూజీలజీశ్రీతి)' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా 15 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు.బాణసంచా కారణంగా కంటి గాయాలకు గురైన చిన్నారులకు సంస్థ చేపట్టిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం ద్వారా ప్రథమ చికిత్స, అత్యవసర కంటి వైద్యం, ఫార్మసీ సేవలతో పాటు అవసరమైన సందర్భాల్లో శస్త్రచికిత్సలను సైతం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ సేవలు 2026 నవంబర్ 4 నుంచి 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 95కు పైగా నగరాల్లోని 200కు పైగా వాసన్ ఐ కేర్, ఏ ఎస్ జి ఐ హాస్పిటల్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.గత ఏడాది దీపావళి సందర్భంగా బాణసంచా ప్రమాదాల్లో కంటి గాయాలకు గురైన 500 మందికి పైగా చిన్నారులకు వాసన్, ఐఇ కేంద్రాల్లో వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. బాణసంచా కాల్చేటప్పుడు చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పిల్లల కంటి చూపుపై జీవితాంతం ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా కార్నియా, కంటిలోని ఇతర భాగాలకు గాయాలయ్యే అవకాశం ఉందని, ప్రమాదం జరిగిన వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో తప్పనిసరిగా దగ్గరుండి పర్యవేక్షించాలని, రక్షణ కళ్లద్దాలు ధరించేలా చూడాలని కోరారు. వెలగని బాణసంచాను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదని, గాయపడిన కంటిని రుద్దడం లేదా ఒత్తడం చేయకూడదని సూచించారు. కంటికి గాయమైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు కంటికి గాయం అయినప్పుడు బాధితులను ప్రశాంతంగా ఉంచాలని, కంటిని రుద్దడం, ఒత్తడం, బలంగా నీటితో కడగడం చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు. కంటిలో ఏదైనా వస్తువు ఇరుక్కుంటే దానిని తొలగించేందుకు ప్రయత్నించకూడదని, కాటుక, ఆయింట్‌మెంట్లు, ఇంటి చిట్కాలు ఉపయోగించకూడదని తెలిపారు. కంటిపై ఒత్తిడి పడకుండా తేలికగా కప్పి, వెంటనే కంటి వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు.

ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్:
1800 5713 333.

బాణసంచా ప్రమాదాల్లో కంటి గాయాలకు గురైన చిన్నారులకు సమీపంలోని కార్యక్రమంలో పాల్గొనే వాసన్ ఐ కేర్ కేంద్రంలో వైద్య సేవలు పొందేందుకు ఈ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. సకాలంలో వైద్య చికిత్స అందిస్తే కంటి చూపును కాపాడుకునే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా దీపావళి జరుపుకోవాలని డాక్టర్ శివరాం కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషన్, డాక్టర్ సృజన్ మరియు ఖమ్మం వాసన్ ఐ కేర్ స్టాఫ్ పాల్గొన్నారు.



రేషన్ డీలర్లకు గౌరవ వేతనంతో పాటు, కమిషన్ కూడా ఇవ్వాలి

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 7 **(జనంసాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర రేషన్ డీలర్ల సమస్యలపై ప్రభుత్వ మేనిఫెస్టోలో పెట్టి వాగ్దానం చేసిన రేషన్ డీలర్లకు గౌరవ వేతనం మరియు 300 కమిషన్ ను అమలు చేయాలని, రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోళ్ళ మురళి ప్రకటన చేశారు.తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత 40 సంవత్సరాల నుండి గతకాల కాంగ్రెస్ ప్రభుత్వం, గత పది సంవత్సరాల క్రితం బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడున్న కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర రేషన్ డీలర్ల సమస్యలను పట్టించుకోకుండా తమ ప్రభుత్వాల అవసరాలకు ప్రజల మన్ననలకు అనుగుణంగా రాష్ట్ర రేషన్ డీలర్ల సేవలను వినియోగించుకుంటూ ఆయా ప్రభుత్వాలు ప్రజల మన్ననలను పొందుతూ దానికి కారణమైన రాష్ట్ర రేషన్ డీలర్లను మాత్రం ఏమాత్రం కూడా పట్టించుకోని పరిస్థితి మన తెలంగాణ రాష్ట్రంలో ఉన్నది. డీలర్లు బియ్యం పంపిణీ వ్యవస్థలో దుమ్ములితో ఆరోగ్యాలు పాడవుతున్న , వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు క్షీణించిన, కోవిడ్ సమయంలో ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు రేషన్ పంపిణీ చేసి రాష్ట్రవ్యాప్తంగా డీలర్లు మరణించిన కూడా ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్థిక సహాయం కాని కనీసం దహన ఖర్చుల నిమిత్తం కూడా ఆదుకోనటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉన్నది రేషన్ డీలర్ల కుటుంబాల అవసరాల కోసం కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి రాష్ట్ర డీలర్ల గోడును పట్టించుకోని వైనం ఈ రాష్ట్రంలో మాత్రమే కనపడుతుంది ఇతర రాష్ట్రాలు రేషన్ డీలర్లకు పెద్దపీట వేసి డీలర్లను ఆ ప్రభుత్వ ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుంటున్నాయి అట్టి విషయాలను ఈ ప్రభుత్వాలకు ఆ రాష్ట్ర తీరుతెన్నులు డీలర్లకు చేసే అనేక రకాల ఆదుకునే పరిస్థితులను తెలియ జేసినా కూడా ఇప్పటివరకు మన రాష్ట్ర ప్రభుత్వం డీలర్లకు న్యాయమైన పటిష్టమైన , ఖచ్చితమైన పనికి జీతం ఇవ్వనటువంటి పరిస్థితులు మన రాష్ట్రంలో ఉన్నాయి కావున మీరు వాగ్దానం చేసి ప్రభుత్వ మేనిఫెస్టోలో పెట్టి కూడా మన ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు గడిచిన కూడా మా మీద జాలికలగని పరిస్థితి ఉన్నది మా రాష్ట్ర సంఘ



నాయకులను కనీసం ఆహ్వానించి చర్చలకు పిలవకుండా కూడా మమ్మలను నిరాకరిస్తూ మా వినతి పత్రాలను మంత్రులకు ఎమ్మెల్యేలకు ఎన్ని ఇచ్చిన ఫలితం లేకుండా ఉండి ఉన్నది కావున ఇప్పటికైనా ప్రభుత్వంమా పై దృష్టి పెట్టి రేషన్ డీలర్ల పై జాలితో దయచూపి డీలర్ల భవిష్యత్తుకు సహకరించాలని, న్యాయం చేయాలని కోరుతున్నామని ఆ సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోళ్ళ మురళి ప్రకటన చేశారు.

ఆరోగ్యకరమైన జీవనశైలితోనే

క్యాన్సర్ నివారణ సాధ్యం

డీఎంహెచ్ఓ డాక్టర్ డి. రామారావు

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 7 (జనంసాక్షి)



నేషనల్ క్యాన్సర్ అవేర్‌నెస్ డే సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు మామిళ్లగూడెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెంటర్‌లోని రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఐడీఓసీ లోని డీఎంహెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక క్యాన్సర్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని అధికారు లకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ గారు మాట్లాడుతూ... సరైన అవగాహన, ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా క్యాన్సర్‌ను సమర్థవంతంగా అరికట్టవచ్చని, ముఖ్యం గా క్యాన్సర్ నివారణ చర్యలు ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.పొగాకు, గుట్కా ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లను పూర్తిగా మానివేయాలని, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల వ్యాయామం, సమతుల్య ఆహారం, తాజా పండ్లు, కూరగాయలు ఆహారంలో భాగం చేసుకోవాలని, జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్స్ తగ్గించాలని, క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి రక్షించుకోవచ్చు ,శరీరంలో అసాధారణ గడ్డలు, తగ్గని పుండ్లు, ఆకస్మిక బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, మహిళల్లో రొమ్ము క్యాన్సర్ నివారణకు ప్రతినెలా స్వయంగా చేసుకునే బి ఎస్ ఈ అంటే బ్రెస్ట్ సెల్ఫ్ ఎగ్జామినేషన్, అత్యంత కీలకమని, దీనిపై మహిళ లందరికీ అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రాథమిక స్థాయిలోనే లక్షణాలను గుర్తించేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది బాధ్యతా యుతంగా పనిచేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు స్పష్టం చేశారు.

స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్‌లో "దీపావళి వేడుకలు"

ఖమ్మం, (జనంసాక్షి) :

స్థానిక శ్రీనగర్‌కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్‌లో దీపావళి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు రకరకాల ఆకారాలలో దీపాలను వెలిగించి కండ్లు మిరుమిట్లు గొలిపే విధంగా రంగు రంగుల కాంతివంతమైన కాకరవత్తులను వెలిగించి ఒక రోజు ముందుగానే దీపావళికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీ కొండా శ్రీధర్ రావు గారు మాట్లాడుతూ దీపావళి పండుగను కాలుష్యరహితంగా, పర్యావరణ హితంగా జరుపుకోవాలని తారాజువ్వలాగా ఆకాశమే హద్దుగా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటూ మీ భవిష్యత్తు అంతా దీపావళి వెలుగుల మాదిరి ప్రకాశవంతం కావడానికి స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్ ప్రణాళిక బద్దంగా పనిచేస్తుందని ప్రత్యేకంగా తెలియచేసారు. దీపావళి ప్రత్యేకతను తెలియచేస్తూ చెడుపై మంచి విజయానికి చిహ్నంగా దీపావళిని జరుపుకుంటారని అందరి జీవితాలలో అంధకారం తొలిగి వెలుగులు నిండాలని సుఖసంతోషాలతో ఉండాలని విద్యార్థులను ఆశీర్వదించి అందరికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీమతి కొండా కృష్ణవేణి గారు పాల్గొని పర్యావరణ హితమైన



దీపాల వెలుగులతో దీపావళి జరుపుకోవాలని విద్యార్థులు టపాసులు కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేస్తూ దీపావళి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కె.సురేష్, ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదం డులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి నాయకులను కలిసిన

సాంస్కృతిక సారథి ప్రతినిధులు

❍సాంస్కృతిక సారథి ఉద్యోగులను కలుపుకుంటామని హామీ

❍సమితి జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు వెల్లడి

ఖమ్మం, (జనంసాక్షి):

తెలంగాణ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితిలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘాన్ని చేర్పించాలని కోరుతూ సాంస్కృతిక సారథి ఖమ్మం జిల్లా కమిటీ ప్రతినిధులు శనివారం సమితి జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు పాగి వెంకన్న, ప్రధాన కార్యదర్శి బొమ్మెర ముత్యం ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కాలికి బలపం కట్టుకుని, పల్లెపల్లెనా తమ కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన ఘనత ఉద్యమ కళాకారులకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కళాకారులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితిలో సాంస్కృతిక సారథి సంఘాన్ని కలుపుకోవడానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఈ విషయంలో సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా సలహాదారు మిమిక్రీ సుధాకర్ రావు, ఉపాధ్యక్షుడు పరకాల అజయ్, సహాయ కార్యదర్శి నకిరికంటి వెంకట్, కోశాధికారి చాపలమడుగు కోటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే ఉద్యోగుల సంఘం నాయకులు జైపాల్, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర రమేష్, శ్రీకాంత్, బుర్రి వెంకటేశ్వర్లు, సాంస్కృతిక కళాకారులు కాలకట్ట జాన్, వెంగళ కుమారి, మునగాల వెంకటరత్నం, బీరెల్లి రమణ, పమ్మి రవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ప్రజాస్వామ్యంపై అవగాహన కలిగి ఉండాలి

తహసీల్దార్ సునీత ఎలిజిబెత్

ఎర్రుపాలెం,నవంబర్ 7 (జనంసాక్షి):



భారత ఎన్నికల సంఘం ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ (ఈ ఎల్ సి ఎస్) ఆధ్వర్యంలో వ్యాసరచన, క్విజ్ పోటీలను తహశీల్దార్ ఏ ఈ ఆర్ ఆధ్వర్యంలో ఎర్రుపాలెం హైస్కూల్ లో శనివారం ఈ.ఎల్.ఎస్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ పోటీల్లోవ్యాసరచన పాఠశాల స్థాయిలో ఓటర్ జాబితా ప్రాముఖ్యత, జూనియర్ కళాశాల స్థాయిలో ఓటింగ్ ప్రాముఖ్యత, క్విజ్‌లో ఓటర్ జాబితా తయారీ, ఈవీఎంలు, వివిప్యాట్లు, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలపై నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు , జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీత ఎల్జి?బెత్ మాట్లాడుతూ విద్యార్థులలో ప్రజాస్వామ్య ప్రక్రియపై అవగాహన పెంపొందించడానికి ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ కీలకమైన వేదికలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటింగ్ పోలింగ్ తీరు, ఈవీఎంలు, వివిప్యాట్లు, పోలింగ్, కౌంటింగ్‌పై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. మండల విద్యాధికారి మురళీమోహన్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్య విలువలపై, ఓటింగ్ విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మండలంలో ఈ పోటీలలో గెలుపొందిన మొదటి ఇద్దరు మధిర నియోజకవర్గ స్థాయిలో జరిగే కార్యక్రమంలో పాల్గొనవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 4 కళాశాలల నుండి 8 మంది విద్యార్థులు, 15 ఉన్నత పాఠశాలల నుండి 30 మంది విద్యార్థులు, మొత్తం 38 మంది విద్యార్థులు పాల్గొన్నారని మధిర నియోజనవర్గ ఏ.యల్. యమ్.టి.విశ్వనాథం తెలిపారు. ఆర్ఐ రవికుమార్ మాట్లాడుతూ గెలుపొందిన వారికి సోమవారం బహుమతులు అందజేస్తామని తెలిపారు. అలాగే మధిర నియోజకవర్గ స్థాయిలో కూడా ఎర్రుపాలెం మండలం మొదటి వరుసలో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రవికుమార్, శిరీష, రెవెన్యూ సిబ్బంది, మండలంలోని విద్యార్థులు, గైడ్ టీచర్లు, పాఠశాల, హెచ్ఎం జీ.వీ.ఎన్, రాజు, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, సత్యనారాయణ, నాగరాజు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



మర్రిగూడలో కురుమ యువ చైతన్య సమితి నూతన కార్యవర్గం ఏర్పాటు

మండల అధ్యక్షుడిగా అచ్చిని బీరప్ప కురుమ ఎన్నిక

మర్రిగూడ, నవంబర్ 7(జనంసాక్షి)

కురుమ యువ చైతన్య సమితి మర్రిగూడ మండల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. సమితి మండల అధ్యక్షుడిగా అచ్చిని బీరప్ప కురుమను, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నీల శంకర్ కురుమను, ప్రధాన కార్యదర్శిగా అరిగే శ్రీను కురుమను ఎన్నుకున్నారు.
నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా బండ శ్రీశైలం కురుమ, అచ్చిని సత్తయ్య కురుమ, కార్యదర్శిగా నీళ్ల నాగేష్, పుష్పరి శ్రీశైలం (పెద్ద) బాధ్యతలు చేపట్టనున్నారు. సలహాదారులుగా బండ రమేష్, తుప్పల కృష్ణయ్య, నీల యాదగిరి కురుమలను ఎంపిక చేశారు. కోశాధికారులుగా కాశ శంకర్, కాసలింగయ్య (పెద్ద), గౌరవ అధ్యక్షుడిగా నీల మహేష్ నియమితులయ్యారు.ఈ కార్యక్రమంలో కురుమ యువ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు బండారి శంకర్, కొండి చంద్రయ్య, సత్తయ్య, బాలం జంగయ్య పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసి సమితి బాధ్యతలను అప్పగించారు.

మండల ప్రజలకు, అధికారులకు దీపావళి శుభాకాంక్షలు

తెలిపిన తహశీల్దార్ సరోజ పావని

మాడుగులపల్లి, నవంబర్ 7 (జనంసాక్షి):



నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల ప్రజలకు, మండల స్థాయి అధికారులకు, సిబ్బందికి మండల తహశీల్దార్ సరోజ పావని దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారుఈ కాంతుల పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, మండలమంతా సంతోషకర వాతావరణం నెలకొనాలని ఆమె ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ సరోజా పావని మాట్లాడుతూ మండల ప్రజలందరూ దీపావళి పండుగను అత్యంత ప్రశాంత వాతావరణంలో, సంతోషంగా జరుపుకోవాలని సూచించారు టపాసులు కాల్చే సమయంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చిన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలని కోరారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, పర్యావరణహితంగా, సోదరభావంతో పండుగను జరుపుకోవాలని ఆమె మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



త్రినిటీ విద్యాసంస్థల్లో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

ప్రమిద ఆకారంలో విద్యార్థుల ప్రతిజ్ఞ

చౌటుప్పల్ నవంబర్ 7(జనం సాక్షి)

త్రినిటీ హైస్కూల్లో ముందస్తు దీపావళి వేడుకలను విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులంతా కలిసి ఒక పెద్ద దీపం (ప్రమిద) ఆకారంలో నిలబడి చేసిన ప్రతిజ్ఞ వేడుకలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఒక చిన్న దీపపు వెలుతురు ఏ విధంగానైతే చీకటిని పార(ద్రోలుతుందో, అదే విధంగా పాఠశాలలోని ప్రతి విద్యార్థి తమ 'జ్ఞానం' అనే వెలుగులను ప్రసరింపజేయాలని యాజమాన్యం ఆకాంక్షించింది. సమాజంలో పేరుకుపోయిన అజ్ఞానాన్ని, అహంకారాన్ని, అతి స్వార్థాన్ని, చంచలత్వాన్ని తమ విజ్ఞానంతో పాంద్రోలతామని చిన్నారులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ విశేష కార్యక్రమంలో త్రినిటీ విద్యాసంస్థల చైర్మన్‌కే.వి.బి. కృష్ణారావు,డైరెక్టర్ ప్రిన్సిపాల్ డా,ఉజ్జీని మంజుల పాల్గొన్నారు. వారితో పాటు పాఠశాల సమన్వయకర్తలు (కోఆర్డినేటర్స్), ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు ప్రాథమిక విభాగానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

కొండూరులో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలి!

రెండు బోర్లు, రెండు మోటార్లు మంజూరు చేయాలని ట్రైనీ కలెక్టర్‌కు సర్పంచ్ వినతి

మర్రిగూడ, నవంబర్ 7 (జనంసాక్షి)



ఇప్పటికే తాగునీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొండూరు గ్రామ ప్రజలకు రానున్న కరువు పరిస్థితుల్లో మరిన్ని కష్టాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సర్పంచ్ సీతారాం నాయక్ కోరారు. గ్రామానికి రెండు బోర్లు, రెండు మోటార్లు మంజూరు చేయాలని నల్గొండ జిల్లా ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం మర్రిగూడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో గ్రామంలో నీటి సమస్య తీవ్రత పెరిగే అవకాశాలున్నాయని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, రానున్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తుగా రెండు బోర్లు, రెండు మోటార్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన పీఏసీఎస్ చైర్మన్ కళ్లెం రాఘవరెడ్డి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 7 (జనం సాక్షి):

రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ కళ్లెం రాఘవరెడ్డి తెలిపారు. జూలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో జగత్‌పల్లి, జంగవారిగూడెం, పెద్దగూడెం, కప్రాయపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్పంచ్ లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు ఫకీర్ యాదిరెడ్డి, సర్పంచ్ లు పక్కిరు లత నర్సిరెడ్డి, ఇటమోని గీతా, రాగీరు నర్మదా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.





పి.ఏ.పల్లి మండల సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి

అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి.ఏ.సి.ఎస్ చైర్మన్ తేర మణిపాల్ రెడ్డి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రమౌళి,స్థానిక తప ాసిల్దార్ జయ శ్రీ, వ్యవసాయ శాఖ అధికారి రావుల పాండు, మండల విద్యాధికారి ధన్నె రాజు,స్థానిక సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి, మండలంలోని సర్పంచులు రమావత్ చిరంజీవి, రాగం అంజయ్య,రాయనబోయిన శ్రీను,ఆడెపు నాగేష్, బొమ్ము వెంకటేష్,రమావత్ కిషన్, కీరు, మేగవత్ కిషన్,రమా,కృష్ణవేణి ఆంజనేయులు, నేనావత్ అనిత లక్ష్మణ్,రఘు నాయక్,వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సహోద్యోగి కష్టాల్లోనూ అండగా నిలిచిన జిల్లా పోలీసులు



సూర్యాపేట (జనంసాక్షి): సహోద్యోగుల కష్టసుఖాల్లో ఒక కుటుంబంలా అండగా నిలవాలన్న జిల్లా ఎస్పీ నరసింహ పిలుపుతో సూర్యాపేట జిల్లా పోలీసు సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు.చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ అకస్మాత్తుగా గుండెపోటుతో అనారోగ్యానికి గురయ్యారు.మెరుగైన వైద్యం కోసం ఆయనను హైదరాబాద్‌లోని ప్రముఖ గ్లెనీగిల్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ నేపథ్యంలో బాలకృష్ణ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు సిబ్బంది, ఒక కుటుంబంలా ఏకమై తమ వంతు సహకారం అందించారు.అందరూ కలిసి సేకరించిన రూ.లక్ష నగదును చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ బాలకృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు.సహోద్యోగి కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం పోలీసు కుటుంబంలోని ఐకత్య, మానవత్వానికి నిదర్శనమని ఈ సందర్భంగా ఎస్పి నరసింహ, పోలీసు అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో వైభవంగా దుర్గామాత ఒడిబియ్యం మహా అన్నదానం

- మార్కండేయ ఆలయంలో సందడిగా చీరల వేలంపాట
- లక్కీ డ్రాలో చేనేత పట్టుచీర, శాలువా విజేతలు

చౌటుప్పల్, నవంబర్ 07(జనంసాక్షి)

చౌటుప్పల్ పట్టణంలోని శ్రీ మార్కండేయ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ దుర్గామాత అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో మహా అన్నదాన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. నవరాత్రుల్లో మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించిన ఒడిబియ్యాన్ని అన్నప్రసాదంగా తయారుచేసి పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా దుర్గామాత ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పెద్ది కృష్ణ, గోశిక బలరాజు, సూరేపల్లి శివ, ఉత్సవ అధ్యక్షులు గోలి శ్రీను, ప్రధాన కార్యదర్శి బత్తుల యశ్వంత్ మాట్లాడుతూ.. అమ్మవారికి నవరాత్రుల్లో సమర్పించిన ఒడిబియ్యంతో అన్నదానం చేపట్టడం పవిత్రమైన సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. అన్ని దానాల్లో అన్నదానానికి విశిష్టమైన స్థానం ఉందని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భక్తిభావం, పరస్పర ఐకత్య, సేవా దృక్పథం పెరుగుతాయని, ఈ సంప్రదాయాన్ని ఏటా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



అమ్మవారి చీరల వేలంపాటలో మహిళల ఉత్సాహం:

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా భక్తులు దుర్గామాతకు సమర్పించిన చీరలను వేలం వేశారు. అమ్మవారి చీరలను సొంతం చేసుకునేందుకు మహిళలు ఉత్సాహంగా ముందుకొచ్చారు. ఒకరితో మరొకరు పోటీపడుతూ వేలంపాటలో పాల్గొని చీరలను కైవసం చేసుకున్నారు.

లక్కీ డ్రా విజేతలు:

అమ్మవారికి సమర్పించిన చేనేత పట్టు చీర, చేనేత పట్టు శాలువా కోసం ప్రత్యేకంగా లక్కీ డ్రా నిర్వహించారు. ఇందులో చేనేత పట్టు చీరను గోశిక కరుణాకర్?సుమతి దంపతులు, చేనేత పట్టు శాలువాను పోలోజు వెంకటాచారి గెలుచుకున్నారు. లక్కీ డ్రా విజేతలను దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించారు.ఈ కార్యక్రమంలో శ్రీ మార్కండేయ దేవాలయ అధ్యక్షులు బడుగు జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శి గోశిక బాలనర్సింహ, ధర్మకర్తలు, దేవస్థాన కమిటీ సభ్యులు, పద్మశాలి యువజన సంఘం సభ్యులు, చేనేత సహకార సంఘం సభ్యులు, భావనారుషి కళానికేతన్ సభ్యులు, దుర్గామాత దీక్షా భక్తులు, మాతృమండలి సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణకు తోడ్పడిన దాతలకు, కమిటీ సభ్యులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ ఆనందరావుకు బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు

ఈ నెల 15న న్యూఢిల్లీలో అవార్డు ప్రధానం

వైద్యంతో పాటు సేవా రంగంలో 10 ఏళ్ల విశేష కృషికి గుర్తింపు

సూర్యాపేట(జనంసాక్షి):

వైద్యం కేవలం వృత్తి మాత్రమే కాదు, సేవా భావంతో చేస్తేనే సమాజానికి నిజమైన సేవ చేసినట్లు అవుతుందని ప్రముఖ ఈఎన్?టీ వైద్యులు డాక్టర్ ఆనందరావు నిరూపించారు.సాధారణ డాక్టర్ జీవితానికి అతీతంగా ఒక విద్యావంతుడిగా సమాజం పట్ల బాధ్యతగా, సామాజిక చైతన్యంతో, సమాజ సేవ చేయడం చాలా ముఖ్యమని ఆయన నమ్ముతారు.ఆ నమ్మకాన్ని గత 10 ఏళ్లుగా తన సేవల ద్వారా నిరూపిస్తున్నారు.డాక్టర్ ఆనందరావు గత పది సంవత్సరాలుగా సమాజానికి చేస్తున్న నిరంతర సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సంస్థ ఆయనను బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపిక చేసింది.ఈ సందర్భంగా డాక్టర్ ఆనందరావు మాట్లాడుతూ ఇది సూర్యాపేట జిల్లాకే గర్వకారణమని అన్నారు.తన సేవలను గుర్తించినందుకు దేవుడికి ధన్యవాదాలు తెలిపారు.ఈ ప్రతిష్టాత్మక జాతీయ అవార్డును ఈ నెల 15న న్యూఢిల్లీలో జరిగే ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానం చేయనున్నారని తెలిపారు.వైద్య రంగంలోనే కాకుండా, విద్యా, సామాజిక, సేవా రంగాల్లో డాక్టర్ ఆనందరావు చేస్తున్న కృషిని అభినందిస్తూ సూర్యాపేట నుండి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు ప్రశంసించారు.





శాంతినికేతన్‌లో ముందస్తు దీపావళి సంబరాలు

మిర్యాలగూడ (జనంసాక్షి) :

దామరచర్ల మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీపావళి పండుగ విశిష్టత, నరకాసుర వధ ఘట్టాన్ని వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో సత్యభామగా ఎస్.కె. ఇశ్రత్, నరకాసురుడిగా బి. భాస్కర్, ఋషులుగా ఎం. చరణ్ నాయక్, పి. సాగర్ నటించి తమ ప్రతిభను చాటారు. ఇతర విద్యార్థులు చెలికత్తెల పాత్రల్లో అలరించారు. విద్యార్థుల కళా ప్రదర్శనను పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ లీమా మేరీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్లు రాణి, రోషి, ఉపాధ్యాయులు భీష్మ, దుర్గ, సత్యనారాయణ, చంద్రశేఖర్, శ్రీను, జాన్ పీటర్, కిషన్, ఈశ్వర్, డాన్స్ మాస్టర్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

భూతరాజు భరత్ జన్మదినం సందర్భంగా ఘనంగా రక్తదాన శిబిరం

సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు ప్రశంసలు కురిపించిన ప్రజలు

కొండమల్లేపల్లి, నవంబర్ 7 (జనంసాక్షి):

భారతీయ జనతా పార్టీ కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడు భూతరాజు భరత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని బ్రదర్స్ బ్లడ్ డొనేషన్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి చౌరస్తాలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ లాలు నాయక్ రంగారెడ్డి జిల్లా సెక్రటరీ నరేష్ యాదవ్, నల్గొండ జిల్లా మాజీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్ సంయుక్తంగా పాల్గొని మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకోవాలని నిర్వాహకులు తెలిపారు. రక్తదానం మహాదానం ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం అనే నినాదంతో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా సామాజిక సేవా భావాన్ని చాటుకున్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమని పలువురు నాయకులు, పాల్గొన్న వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరానికి సహకరించిన వైద్య సిబ్బందికి, రక్తదాతలకు, నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జంగిటి మల్లేష్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నం పద్మావతి, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు నెల్లికంటి గోపి, సున్న మహేష్, యువమోర్చా మండల అధ్యక్షుడు గణేష్ యాదవ్, దాసు గురుస్వామి, పరమేష్ గురుస్వామి, అంజన్ సాయి ఉదయ చందు నాగ మధు హేమంత్ వేణు వంశీ విజయ నాయక్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణవేణి పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు



రామన్నపేట, నవంబర్ 7 (జనంసాక్షి):

రామన్నపేట మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ముందస్తు దీపావళి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు దీపావళి పండుగ ప్రాముఖ్యతను వివరించారు. దీపావళి పండుగను కాలుష్య రహితంగా జరుపుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా తీసుకోవలసిన పలు జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులు పాఠశాల మైదానంలో దీపావళి పండుగను పురస్కరించుకొని పలు భంగిమల ఆకారంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి. సురేష్, అకాడమీ డైరెక్టర్ జెవిఎన్ఎస్ మణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్మగూడెం, సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో దీపావళి వేడుకలు

పెద్దవూర నవంబర్ 7 (జనంసాక్షి)



అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాను. పాఠశాల ప్రాంగణం అంతా విద్యార్థుల చిరునవ్వులు, దీపాల వెలుగులతో కళకళలాడింది.ఈ వేడుకల్లో పాఠశాల అడ్మినిస్ట్రేటర్ శ్రీ మార్టిన్ మాథ్యూ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ మార్టిన్ మాథ్యూ గారు మాట్లాడుతూ. సమాజంలోని చీకట్లను పారద్రోలి, ప్రతి విద్యార్థి తమ తమ ప్రాంతాల్లో జ్ఞానపు వెలుగులై ప్రకాశించాలని పిలుపునిచ్చారు.దీపావళి స్ఫూర్తిని చాటేలా విద్యార్థులు ప్రదర్శించిన ఉత్సాహం, ఉపాధ్యాయుల చొరవ ఈ వేడుకలను మరింత విజయవంతం చేశాయి. అందరూ ఒకరికొకరు దీపావళి శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకను ఆనందంగా ముగించారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

డ్రగ్స్‌తో బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు.. విద్యార్థులకు అవగాహన

దేవరకొండ, నవంబర్ 07 (జనం సాక్షి):

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, మై భారత్ నల్గొండ వారి ఆధ్వర్యంలో శనివారం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, ఎంకేఆర్ ప్రిన్సిపాల్ రవి నాయక్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం మానవ శరీరంపై, కేంద్ర నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే శారీరకంగా, మానసికంగా బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకునే ప్రమాదం ఉందన్నారు. యువతలో కోపం, దూకుడు, మానసిక అస్థిరత వంటి సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు.యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ బాబు, జాంగిర్, కవిత, మై భారత్ కేంద్ర ప్రతినిధి కొండా నాయక్, యూత్ వాలంటీర్లు సతీష్, శ్రీకాంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

